సాక్షి కామారెడ్డి

శనివారం ǀ 5 ǀ జూలై ǀ 2025



పూడికతీతకు మోక్షం
పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువలో పెరిగిన పొదలు, పూడిక తొలగింపునకు నిధులు మంజూరయ్యాయి.

- 8లో ▸



పరిశుభ్రంగా ఉంచుకోవాలి
జిల్లాలోని పలు ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. అధికారులు కాలనీలలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు.

- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /22.9

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



గాంధారి : ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం జిల్లాలోని వ్యవసాయ శాఖాధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఆయిల్‌పాం తోటలు, ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తుందన్నారు. ఇందులో అంతర పంటలతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి ఏడీఏలు అపర్ణ, సుధా మాధురి, మండల ఏవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను శుక్రవారం డీఈవో రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ గతేడాది పదో తరగతి, ఇంటర్‌లలో ఉత్తీర్ణత శాతం బాగుందన్నారు. పాఠశాల నిర్వహణ, మెనూ అందించిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ మాధవరావు, సిబ్బంది చరణ్ కుమార్ ఉన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం రాక

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఐదుగురు సభ్యుల బృందం శనివారం జిల్లాకు రానుంది. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ పీడన నిరోధక చట్టం(పీసీఆర్ యాక్ట్), అట్టడుగు వర్గాలపై దాడులను నిరోధించే ప్రత్యేక చట్టం (పీవోఏ యాక్ట్), ల్యాండ్, సర్వీస్ విషయాలపై ఆయన సమీక్షిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి బాధితులు హాజరవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు వేరొక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా వినతి పత్రాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.



కేజ్‌వీల్స్‌తో తారుమారు!

ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు వేస్తున్నాయి. అయితే రోడ్ల నిర్మాణంతో రవాణా కష్టాలు తీరినట్టేనని అనుకునేలోపే కేజ్‌వీల్ ట్రాక్టర్లు వాటిని ధ్వంసం చేస్తున్నాయి. కేజ్‌వీల్స్‌తో తిరగడం మూలంగా రోడ్లు కోతకు గురై గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. దీనికి చెక్ పెట్టేందుకు తిప్పాపూర్‌వాసులు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు.

దెబ్బతింటున్న రహదారులు
- కాపాడుకునేందుకు నడుం బిగించిన తిప్పాపూర్‌వాసులు
- కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే రూ. 25 వేల జరిమానాకు తీర్మానం
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణాలకు ఏటా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాయి. రవాణా సౌకర్యం మెరుగుపడాలన్న ఉద్దేశంతో మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు వేస్తున్నాయి. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి 3 వేల కిలోమీటర్లపైన రోడ్లున్నాయి. ఇందులో చాలా వరకు తారురోడ్లే.. రోడ్లు భవనాల శాఖ పరిధిలో 924.59 కిలోమీటర్ల మేర తారు రోడ్లుండగా.. పంచాయతీ రాజ్ శాఖ ఆధీనంలో 2,268 కిలోమీటర్ల మేర రోడ్లున్నాయి. ఇందులో సిమెంటు రోడ్లు 190 కి.మీ., తారు రోడ్లు 828.71 కి.మీ., మెటల్ రోడ్లు 327.73 కి.మీ., మట్టి రోడ్లు 921.37 కి.మీ. ఉన్నాయి. జాతీయ రహదారులు, మున్సిపల్ రహదారులు అదనం.

9,963 వ్యవసాయ ట్రాక్టర్లు..

రవాణా శాఖ రికార్డుల ప్రకారం జిల్లాలో 9,963 వ్యవసాయ పనులకు సంబంధించి అనుమతులు పొందిన ట్రాక్టర్లు, 4,120 కమర్షియల్ అనుమతి పొందిన ట్రాక్టర్లు ఉన్నాయి. అయితే చాలా ట్రాక్టర్లు వానాకాలం, యాసంగిలలో వరి నాట్ల కోసం కేజ్‌వీల్స్‌తో నడుపుతుంటారు. వీటితో రోడ్లు దెబ్బతింటున్నాయి.

రోడ్డును కాపాడుకునేందుకు..

భిక్కనూరు మండల కేంద్రం నుంచి రామేశ్వర్‌పల్లి మీదుగా తిప్పాపూర్‌కు అక్కడి నుంచి ఆరెపల్లి, తలమడ్ల తదితర గ్రామాలకు డబుల్ రోడ్డు వేశారు. ఇంకా కొన్ని చోట్ల పని జరుగుతోంది. అయితే కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను నడిపితే రోడ్డు దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో రోడ్డును కాపాడుకునేందుకు వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా గురువారం సమావేశమయ్యారు. ఎవరైనా తారు రోడ్డుపై కేజ్‌వీల్స్ తిప్పితే రూ. 25 వేలు జరిమానా విధించాలని నిర్ణయించారు. రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడుపుతుండగా చూసి సమాచారం ఇచ్చిన వారికి రూ.2 వేల నజరానా ఇవ్వాలని తీర్మానించారు. దీనిపై అంతటా చర్చ నడుస్తోంది. ఇలా అన్ని గ్రామాల ప్రజలు ముందుకు వస్తే కోట్లాది రూపాయల ప్రజాధనం కేజ్‌వీల్ పాలు కాకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పవద్దని తీర్మానం చేసిన తిప్పాపూర్‌వాసులు(ఫైల్)

ధ్వంసమవుతున్న రోడ్లు..

ఎద్దు ఎవుసం ఉన్నప్పుడు నాగళ్లు, గొర్లు ఎడ్ల బండిపై వేసుకుని వెళ్లి వరి నాట్లు పూర్తయ్యే దాకా అక్కడే ఉంచేవారు. కొందరు పరికరాలను పొలం దగ్గరే భద్రపరచుకునేవారు. నాగళ్లు, గొర్లుతో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అలాగే ఎడ్లబండితో కూడా రోడ్లు దెబ్బతినేవి కాదు. అయితే ఎప్పుడైతే ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయో రోడ్లకు కష్టకాలం దాపురించింది. బురదలో ట్రాక్టర్లతో పొలాలను దున్నడానికి కేజ్‌వీల్స్ వాడుతుంటారు. పొలం దగ్గరికి వెళ్లిన తర్వాత ఫుల్ కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్‌కు బిగించుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు. సీజన్ మొదలైన నుంచి ముగిసేదాకా కొందరు కేజ్‌వీల్స్‌ను అలాగే ఉంచుతున్నారు. రోజూ ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి రోడ్లపై తీసుకు వెళ్తున్నారు. ఇలా వెళ్లడం మూలంగా రోడ్లు కోతకు గురవుతున్నాయి. అప్పుడప్పుడు అధికారులు కేసులు నమోదు చేస్తున్నా మార్పు రావడం లేదు. రోడ్లు దెబ్బతినకుండా ఉండేందుకు కేజ్‌వీల్స్‌కు పట్టీలు బిగించడమో, ఇతర ప్రత్యామ్నాయాలు ఆలోచించడమో చేయాలని కోరుతున్నారు.

సమష్టి నిర్ణయం



మా గ్రామానికి రెండు వరుసల రోడ్డు వేయడంతో అందరం సంతోషించాం. అయితే కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు తిరిగితే అది చెడిపోతుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులం సమావేశమయ్యాం. కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పితే రూ. 25 వేల జరిమానా విధించాలని తీర్మానించాం. రోడ్లను కాపాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం.

– కొండ సిద్ధిరాములు, వీడీసీ ప్రెసిడెంట్, తిప్పాపూర్

రోడ్లు దెబ్బతింటాయనే..



మేమంతా రైతులమే. అందరం కేజ్‌వీల్ ట్రాక్టర్లతో దున్నకాలు చేసుకునేవాళ్లమే.. అయితే కేజ్‌వీల్స్‌తో రోడ్లపై నడిపితే అవి దెబ్బతింటాయి. కోట్ల రూపాయలతో వేసిన రోడ్లను కాపాడుకోవలసిన అవసరం ఉంది. అందుకే కేజ్‌వీల్స్ తిరగకుండా చూడాలని గ్రామస్తులందరం కలిసి నిర్ణయం తీసుకున్నాం.

– తాటిపల్లి సిద్ధరాములు, రైతు, తిప్పాపూర్

కొబ్బరి కొండెక్కింది!

బొండం నుంచి నూనె వరకు.. ■ భారీగా పెరిగిన ధరలు



భిక్కనూరు : ఆషాఢ మాసం అయినప్పటికీ కొబ్బరి కాయల ధరలు కొండెక్కాయి. పక్షం రోజుల్లోనే 20 శాతం పెరిగాయి. పదిహేను రోజుల క్రితం ఒక్కో ఎండు కొబ్బరికాయ ధర రూ. 25 ఉండేది. ప్రస్తుతం రూ. 30కి చేరింది. కొబ్బరి బొండం కూడా రూ. 50 నుంచి రూ. 80 వరకు విక్రయిస్తున్నారు. కుడుకల ధరల కూ రెక్కలొచ్చాయి. పక్షం రోజుల్లోనే కిలో కుడుకల ధర రూ. 280 నుంచి రూ. 400లకు చేరడం గమనార్హం. కొబ్బరి నూనె ధర కూడా పెరిగింది. 175 ఎంఎల్ కొబ్బరి నూనె ధర గతంలో రూ. 70 ఉండగా ప్రస్తుతం రూ. 125కు విక్రయిస్తున్నారు. కొబ్బరి ధరలు ఇలా భారీగా పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంట తక్కువగా ఉండడంతోనే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులంటున్నారు.

కొంటలేరు..



పదిహేను రోజుల్లోనే కొబ్బరి ధరలు బాగా పెరిగాయి. కొబ్బరి బొండం నుంచి నూనె వరకు అన్నింటి ధరలు కొండెక్కాయి. ధరలు పెరగడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

– వీరేందర్, కిరాణ వ్యాపారి, భిక్కనూరు

ఇంకెంత పెరుగుతుందో..



కొబ్బరి కాయ ధర బాగా పెరిగింది. ఒక్కోటి రూ. 30కి అమ్ముతున్నారు. ఆషాఢంలోనే ఇంత ధర ఉంటే వచ్చే శ్రావణ మాసంలో ఇంకా ఎంత పెరుగుతుందో ఏమో.. ప్రభుత్వం ధరల పెరుగుదలను అదుపు చేయాలి.

– వసంత, భిక్కనూరువాసి

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- అధిక ధరలకు విక్రయిస్తే కేసులు పెట్టండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయించే దుకాణాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేయడానికి ఇప్పటికే జిల్లాకు 25 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సొసైటీల ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. మరో 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇంకా ఎంత అవసరం ఉంటుందో నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 2,500 ఎకరాలలో పామాయిల్ తోటల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి 200 ఎకరాలను టార్గెట్‌గా నిర్దేశించుకుని తోటల పెంపకం లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఏఎస్పీ నర్సింహారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, ఏడీఏలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

దొడ్డి కొమురయ్య వర్ధంతి

కామారెడ్డి క్రైం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు మర్కంటి భూమయ్య, నాయకులు మల్లయ్య, శివరాములు, విఠల్, శ్రీ కాంత్, నిఖిల్, రవి, స్వామి, గంగాధర్, రాజయ్య పాల్గొన్నారు.



పేలుడు పదార్థాల కలకలం

- జిల్లాకేంద్రంలో 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటోనేటర్‌లు స్వాధీనం
- 16 బెండళ్ల కార్డెక్స్ వైరు, ఇతర సామగ్రి సైతం..
- రాళ్ల బ్లాస్టింగ్‌కు ఉపయోగిస్తుండగా పోలీసులకు సమాచారం
- నలుగురిపై కేసు నమోదు, నిందితుల రిమాండ్

కామారెడ్డి క్రైం : పెద్ద ఎత్తున పేలుడు పదార్థాల నిల్వలు బయటపడడం జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించింది. ఓ ఇంటి నిర్మాణం కోసం బండరాళ్ల బ్లాస్టింగ్‌కు ఈ సామగ్రిని వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నారు. జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో నివాసం ఉంటున్న చింతల శ్రీధర్‌కు కేపీఆర్ కాలనీలో ఓ ప్లాటు ఉంది. దాంట్లో ఇంటి నిర్మాణం కోసం పనులు ప్రారంభించాడు. గుంతలు తీయగా వచ్చిన బండరాళ్లను పేల్చివేసి తొలగించడానికి బొంత సంపత్, లక్ష్మీనారాయణ, రాజులతో రూ.50 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమ పద్ధతిలో సేకరించిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, కార్డెక్స్ వైరు, బ్యాటరీలతో బండరాళ్లను పేల్చడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు దీనిని గమనించి భయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మరోచోట పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలు నిల్వ చేసిన విషయం బయటపడింది. పట్టణానికి సమీపంలోని లింగాపూర్ శివారులో ఇటీవలే వెలసిన శ్రీవారి వెంచర్‌లోని రేకుల షెడ్డులో 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటోనేటర్లు, 16 బెండల్స్(సుమారు 4,300 మీటర్లు) కార్డెక్స్ వైరు, బ్యాటరీ, ఒక చెక్ మీటర్, ఇతర సామగ్రిని అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. వాటన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. శంకర్, స్వామి అనే వ్యక్తుల ద్వారా పేలుడు పదార్థాలను తెప్పించినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతానికి చింతల శ్రీధర్, సంపత్, లక్ష్మీ నారాయణ, రాజులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. విచారణ కొనసాగుతుందన్నారు. విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో నరహరి, ఎస్సై శ్రీరాం, కానిస్టేబుళ్లు నరేష్, విశ్వనాథ్, అనిల్, విజయ్ గౌడ్, వినయ్, సంపత్, నర్సారెడ్డిలను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్ల పేల్చివేత..

కేపీఆర్ కాలనీలోని శ్రీధర్ ప్లాట్‌లో బండరాళ్లను పేల్చేందుకు పేలుడు పదార్థాలను సిద్ధం చేసి ఉంచినట్లు గుర్తించిన పోలీసులు.. బాంబ్ స్క్వాడ్ బృందాన్ని రప్పించారు. శుక్రవారం సాయంత్రం కాలనీలో ప్రజల రాకపోకలను నిలిపివేసి ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా వాటిపై మట్టి కుప్పలు పోయించి, జాగ్రత్తలు తీసుకుంటూ పేల్చివేశారు.



వెంచర్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

పార్కింగ్‌కు చోటేది?

- కొంచెం స్థలం కూడా వదలకుండా నిర్మాణాలు
- సెల్లార్‌లలోనూ దుకాణాల ఏర్పాటు
- రోడ్లపైనే వాహనాలను నిలపాల్సిన పరిస్థితి
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్ : నాలుగు జిల్లాల కూడలి అయిన కామారెడ్డి పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. జిల్లా కేంద్రం అయ్యాక రాకపోకలు మరింత పెరిగాయి. అయితే వాహనాలను నిలిపేందుకు స్థలం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్లపైనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. నిబంధనలప్రకారం బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేప్పుడు సెల్లార్‌ను పార్కింగ్‌కోసం వదలాల్సి ఉంటుంది. కానీ సెల్లార్‌లను నిర్మించినా.. వాటిలోనూ దుకాణాలను ఏర్పాటు చేశారు. కొందరు డ్రెయినేజీలు, రోడ్లను ఆనుకొని నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లతో పాటు వ్యాపార సముదాయాల ఏరియాల్లో పార్కింగ్ స్థలాలు లేక వాహనాలను రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. రద్దీ సమయాల్లో ఆయా రోడ్లపై నడవడం కూడా ఇబ్బందిగా ఉంటోంది. ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా బల్దియా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



నిజాంసాగర్ చౌరస్తాలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..

జిల్లా కేంద్రంలో 25 వేల వరకు గృహాలున్నాయి. ప్రధాన రోడ్లపై వ్యాపార దుకాణాలు 5,500 లకుపైగా ఉన్నాయి. సెల్లార్లతో కూడిన భవనాలు 50 కిపైగా ఉంటాయి. కొన్ని సెల్లార్‌లలో వ్యాపార దుకాణాలను నిర్మించుకుని యజమానులు యథేచ్ఛగా అద్దెలకు ఇచ్చుకున్నారు. చాలా భవనాలు సెట్ బ్యాక్ లేకుండా రోడ్లు, మురికి కాలువలపైనే నిర్మించారు. వీరంతా మున్సిపాలిటీ అనుమతుల ఒకలాగా ప్లానింగ్ తీసుకుని, నిర్మాణాలు మాత్రం మరొకలా చేపట్టారు.

సాక్షి ఫోకస్

ఓపెన్ స్థలాలలో ఏర్పాట్లు చేస్తే..

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే చోట మున్సిపాలిటీకి సంబంధించిన ఓపెన్ స్థలాలున్నాయి. వీటిలో వాహనాలను నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే సుభాష్‌రోడ్, మాయాబజార్, వీక్లీమార్కెట్‌రోడ్, నాజ్‌టాకీస్ రోడ్‌ల పార్కింగ్ సమస్య తీర్చేందుకు గాంధీగంజ్‌లో, పొట్టిశ్రీరాములు విగ్రహం పక్కన, గంజ్ ప్రభుత్వ స్కూల్ ముందు, లయన్స్ క్లబ్ సమీపంలోని మున్సిపల్ స్థలాలను పార్కింగ్ కోసం వినియోగించుకుంటే ట్రాఫిక్ సమస్య కొంత తీరే అవకాశాలున్నాయి.

అంతటా ట్రాఫికర్..

జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లు, కూడళ్లతో పాటు, గల్లీల్లోనూ పార్కింగ్ సమస్య నెలకొంది. సుభాష్‌రోడ్, మాయాబజార్, నాజ్‌టాకీస్‌రోడ్, సిరిసిల్లరోడ్, వీక్లీమార్కెట్‌రోడ్, స్టేషన్‌రోడ్, పోలీస్‌స్టేషన్‌రోడ్, నిజాంసాగర్‌చౌరస్తా, జాతీయ రహదారి, కొత్తబస్టాండ్, దేవునిపల్లిరోడ్, జన్మభూమిరోడ్, అశోక్‌నగర్ కాలనీ, పాతబస్టాండ్, అడ్లూర్‌రోడ్‌లలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా ముందు హోటళ్లు, బార్‌లు, వ్యాపార దుకాణాల ముందు పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. అలాగే పాతబస్టాండ్, సిరిసిల్లరోడ్‌లో బ్యాంకుల ముందు కూడా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. గల్లీలలో కూడా డ్రెయినేజీ వరకు నిర్మాణాలతో పార్కింగ్‌కు సమస్యలు ఏర్పడుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

పట్టణంలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు అనుమతి లేని సెల్లార్‌ల యజమానులకు, రోడ్లపై ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేస్తాం. వ్యాపార, వాణిజ్య దుకాణాల వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని వాటి నిర్వాహకులకు సూచిస్తాం. పోలీసు శాఖ సమన్వయంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. వాహనదారులు సైతం ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు అలా నిలపకూడదు.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



కొత్తబస్టాండ్ ప్రాంతంలో రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్,



సిరిసిల్లరోడ్‌లోని యూనియన్ బ్యాంక్ సమీపంలో...,



విద్యానగర్ కాలనీలో...,



సిరిసిల్లరోడ్‌లో..

క్లుప్తంగా

బల్దియా కార్మికులకు వైద్య శిబిరం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక జీజీహెచ్‌లో నిర్వహించిన ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. కార్మికుల ఆరోగ్య క్షేమం కోసం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సానిటరీ ఎస్సై పర్వేజ్, కార్మికులు పాల్గొన్నారు.

దుర్కిలో..

నస్రుల్లాబాద్: దుర్కి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం డాక్టర్ అలేఖ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు పరీక్షలు చేసి మందులను అందించారు. ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, తదితరులున్నారు.

కొయ్యగుట్టలో దోమల మందు పిచికారీ

బాన్సువాడ రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నామని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పేర్కొన్నారు. శుక్రవారం వందరోజుల ప్రణాళిక ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి కొయ్యగుట్ట కాలనీలో పర్యటించారు. దోమల నివారణ మందు పిచికారి చేయించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో ప్రజలకు మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరువేరుగా ఉంచాలని, ఆటోలలో చెత్తను వేరుగా వేయాలని అన్నారు. దీంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆలిండియా బంజారా సంఘంలో వర్గపోరు

- వేర్వేరుగా మండల కార్యవర్గాల ఎంపిక

గాంధారి(ఎల్లారెడ్డి): ఆలిండియా బంజారా సంఘం మండలంలో రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇరు వర్గాల వారు ఎవరికి వారే అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేసినట్లు శుక్రవారం ప్రకటించుకున్నారు. ఓ వర్గం నుంచి ఆలిండియా బంజారా సంఘం మండల అధ్యక్షుడిగా తేజావత్ మోతిరాం, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ దశరథ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. మరో వర్గం నుంచి అధ్యక్షుడిగా సకారాం నాయక్, కార్యదర్శిగా దేవిసింగ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పూడికతీతకు మోక్షం

- పోచారం ప్రధానకాలువలో పనులకు రూ.40 లక్షల నిధులు మంజూరు
- పూర్తయిన టెండర్ ప్రక్రియ



కాలువకట్టపై దారికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు



పోచారం ప్రధానకాలువలో దట్టంగా పెరిగిన చెట్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల వరప్రదాయినిగా పేరొందిన పోచారం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధానకాలువలో పూడికతీత, పొదల తొలగింపుతోపాటు కాలువకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లు, పొదల తొలగింపునకు మోక్షం లభించనుంది. చాలాకాలంగా ప్రధాన కాలువలో పెరిగిన చెట్లతోపాటు పూడిక వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి చివరి ఆయకట్టుకు నీరు చేరేందుకు ఎన్నో ఇబ్బందులు కలిగేవి. దట్టంగా పెరిగిన చెట్లతోపాటు పూడికను, కాలువకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని స్థానిక నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో అధికారులు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ కింద రూ.40 లక్షల నిధులను మంజూరు చేశారు. పనులకు సంబంధించి ఇటీవల అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తిచేశారు. త్వరలోనే కాలువలో పూడికతీత పనులు చేపట్టనున్నారు.

నిధుల మంజూరులో ఆలస్యం..

పోచారం ప్రధాన కాలువలో పూడికతీత, చెట్ల తొలగింపు పనులకు నిధుల మంజూరులో ఆలస్యమయింది. ఇటీవల రబీ పంటలసాగు పూర్తయ్యేనాటికి నిధులు మంజూరై, టెండర్ ప్రక్రియ పూర్తయ్యుంటే వేసవిలో కాలువ మరమ్మతు పనులు చేపట్టేందుకు వీలుగా ఉండేది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవడంతోపాటు ప్రాజెక్టు నిండితే వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీని వల్ల కాలువ మరమ్మతు పనులకు ఆటంకం కలుగనుంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందవుతుంది



పోచారం గ్రామశివారులో ప్రధానకాలువ పక్కన ఉన్న నా పొలానికి వెళ్లాలంటే కాలువ కట్ట వెంట పోవాలి. కాలువ కట్టకు ఇరువైపులా దట్టంగా తుమ్మ చెట్లు పెరిగాయి. పొలానికి వెళ్తుంటే చెట్ల కొమ్మలు కళ్లకు తగులుతున్నాయి. వాటిని తొలగించాలని అధికారులకు విన్నవించాం. నిధులు మంజూరయ్యాయని తెలిసింది. అధికారులు స్పందించి చెట్లకొమ్మలను తొలగించాలి.

– రాజు, రైతు, పోచారం, నాగిరెడ్డిపేట

నీరందేలా చేయాలి



పోచారం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టుకు అందడంలేదు. ప్రధానకాలువలో దట్టంగా పెరిగిన చెట్లతో పాటు పూడిక వల్ల నీరు చివరి ఆయకట్టు వరకు చేరడానికి చాలా సమయం పడుతోంది. ప్రధానకాలువలో పెరిగిన చెట్లను, పూడికను తీసేస్తే నీరు సకాలంలో చేరుతుంది. కాలువలో పెరిగిన చెట్లకొమ్మలను తొలగించడంపై అధికారులు దృష్టి సారించాలి.

– పట్లోళ్ల భాగయ్య, రైతు, ఆజామాబాద్, ఎల్లారెడ్డి

టీచర్‌గా మారిన కలెక్టర్



విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రాజంపేట: కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ టీచర్‌గా మారి తలమడ్ల పాఠశాలలోని విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని తలమడ్ల, ఆరేపల్లి గ్రామాలలో ఆయన శుక్రవారం పర్యటించారు. తలమడ్ల జెడ్పీహెచ్ఎస్, మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తలమడ్ల ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి గణిత సమస్యలను పరిష్కరించేందుకు పలు సూచనలిచ్చారు. 9, 7వ తరగతి గదులలో విద్యార్థులతో ఇంగ్లీష్ రీడింగ్ చేయించారు. అనంతరం ప్రైమరీ స్కూల్ , జెడ్పీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రైమరీ స్కూల్ కిచెన్ షెడ్ సరిగా లేకపోవడంతో రూ.50 వేలు మంజూరు చేస్తూ మరమ్మతులు చేయించాలని ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రమేష్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం ఆరేపల్లిలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై చర్చించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ జానకిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఐకేపీ ద్వారా ఇచ్చే రుణాల గురించి అవగాహన కల్పించాలని ఎంపీడీవో రఘురాంను ఆదేశించారు. ఆర్డీవో జ్యోతి, ఎంఈవో పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్లో పీజీటీ గణిత శాస్త్రం బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తోట గాంధీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ బోధించేందుకు మ్యాథ్స్‌లో ఎంఎస్సీ, బీఈడీ చదిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే డెమో క్లాసులకు హాజరుకావాలని కోరారు.

6 నుంచి గీతా మందిరంలో అర్థచాతుర్మాస్య మహావ్రతం

కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈ నెల 6 నుంచి సెప్టెంబర్ 3 వరకు 43వ వార్షిక శ్రీఅర్థ చాతుర్మాస్య మహావ్రతం నిర్వహించనున్నట్లు శ్రీగీత తత్త్వార్థ జ్ఞాన సత్సంగం అధ్యక్ష, కార్యదర్శులు పాత అశోక్, అర్వపల్లి రమేష్‌లు తెలిపారు. శుక్రవారం గీతా మందిరంలోమాట్లాడారు. బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామిజీ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 7 గంటల 8 వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు ధ్యానం, ప్రవచనాలుంటాయన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలి

నస్రుల్లాబాద్: నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ సూచించారు. శుక్రవారం నెమ్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు.పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శి హన్మవ్వ, నాయకులు గంగారాం, తదితరులున్నారు.

రామారెడ్డిని రక్షించే అష్ట భైరవులు

మీకు తెలుసా?

రామారెడ్డి గ్రామాన్ని పురాతన కాలం నుంచి ఊరు చుట్టూ ఉన్న అష్ట భైరవులు రక్షిస్తుంటారని గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. అష్ట భైరవులు స్వయంభుగా వెలియగా, కాలక్రమేణ రెండు విగ్రహాలు మాత్రమే పూజలందుకుంటున్నాయి.

- గ్రామంలోని 12ఫీట్ల దిగంబర కాలభైరవుడి విగ్రహానికి ఆలయంతోపాటు నిత్య పూజలందుకుంటుండగా, మరో విగ్రహం కాశిపల్లి కాలభైరవుడిగా పూజలు అందుకుంటున్నాడు. మిగతా విగ్రహాలు కనుమరుగయ్యాయి.
- దేశంలోని కాశీ, కాశ్మీర్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో అక్కడక్కడ కాలభైరవుడి ఆలయాలు ఉన్నా, ప్రత్యేకంగా ఆలయం ఉన్నది మాత్రం ఇక్కడే.
- స్వామివారికి వైశాఖమాసంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ప్రతి యేటా కార్తీక బహుళ పంచమి నుంచి నవమి వరకు కాలభైరవుడి జన్మదిన ఉత్సవాలు నిర్వహిస్తారు.
- గతంలో కరువు కాటకాలు వచ్చినప్పుడు గ్రామస్తులందరూ కాలభైరవుడి భయంకర విగ్రహానికి ఆవు పేడ పూసి కానరాకుండా చేయడంతో రెండు మూడు రోజులకే సమస్యలన్నీ పరిష్కారం అయ్యేవి.
- గ్రామాన్ని కాలభైరవుడు రక్షిస్తుండటంతో ప్రజలు భక్తితో పూజలు నిర్వహిస్తూ, అభివృద్ధిలోకి తెచ్చారు.
- స్వామివారికి వామాచార, దక్షిణాచార పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తారు.
- ఈ ఆలయం 1978 నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉంది.

– రామారెడ్డి



ఇసన్నపల్లిలోని కాలభైరవుడు



రామారెడ్డిలోని కాశిపల్లి కాలభైరవుడు

సమాచారం

అత్యవసరంలో డయల్ 112

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సేవలన్నింటి కోసం డయల్ 112ను అమలులోకి తీసుకువచ్చింది. డయల్ 100, 108, 101 స్థానంలో 112 సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉంటాయి. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి ఈ సేవలను ఆపరేట్ చేస్తారు. సెల్‌ఫోన్ లేదా ఫోన్ నుంచి 112కు కాల్ చేస్తే పోలీస్, ఫైరర్, మెడికల్, చిల్డ్రన్, ఉమెన్, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అత్యవసర సేవలను ఈ ఒక్క నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.

రోశయ్య సేవలు మరువలేనివి



కలెక్టరేట్‌లో రోశయ్య జయంతి నిర్వహిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఏఎస్పీ నరసింహారెడ్డి, పోలీసు అధికారులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రోశయ్య జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్‌గా రోశయ్య అందించిన సేవలు విలువైనవని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సాయిరెడ్డి, వెంకట్ రెడ్డి, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏఎస్పీ నరసింహా రెడ్డి, అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సంక్షిప్తం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఓపెన్‌స్కూల్ సొసైటీ రాష్ట్ర పరిశీలకురాలు పద్మజ అన్నారు. శుక్రవారం కల్వరాల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. తక్కువగా ఉన్న విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేసినందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డిని అభినందించారు. ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ రవీందర్, ఎన్జీవో అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. శుక్రవారం ఆయన శెట్పల్లి, అయ్యపల్లి తండాలో ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంట్లో వాడిన నీరు వృథా పోకుండా ఇంకుడు గుంతలకు తరలించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని నాగన్నగారి బావిని పరిశీలించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రపంచ దేశాలకు భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్, నేతలు లింగారావు, దత్తురాం, రాంచందర్, నవీన్‌కుమార్, వంశీకృష్ణ, భీమయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నాటిన మొక్కలను సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తాడ్వాయి శివారులోని ఈతవనంలో శుక్రవారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. ఎస్సై దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం ఖండేబల్లూర్‌లో శుక్రవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ మొక్కలు నాటారు. రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు నాటి హరితహారానికి శ్రీకారం చుట్టారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

బిచ్కుంద(జుక్కల్): బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ ఖయ్యుం, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున షెట్కార్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమం సందర్భంగా శుక్రవారం బిచ్కుందలో నాయకులు మున్సిపల్ అధికారులతో కలిసి కందర్‌పల్లి రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, తుకారాం, గంగాధర్ పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పురుగు మందుల దుకాణాలను గాంధారి ఏవో రాజలింగం, ఎల్లారెడ్డి ఏవో నదీమ్, ఎస్సై ఆంజనేయులతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. పురుగు మందుల దుకాణాలపై పర్యవేక్షణ కరువు శీర్షికతో సాక్షిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయశాఖాధికారులు పోలీసులతో కలిసి తనిఖీలు చేసి దుకాణాల్లో విక్రయించే మందులు, రికార్డులు పరిశీలించారు.

సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించాలి



పిట్లం(జుక్కల్): నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే అరుణతార డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో ఆమె నాయకులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. అనంతరం అరుణతార మాట్లాడుతూ.. రోడ్లను అస్తవ్యస్తంగా తవ్వేసి పనులు ప్రారంభించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. దీంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు అశోక్ రాజ్, రవి చంద్ర, మండల పార్టీ అధ్యక్షులు గుండా సాయిరెడ్డి, మాజీ అధ్యక్షుడు అభినయ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యక్షులు సాయి గౌండ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు కంటైనర్ దగ్ధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి గ్రామ శివారులో గల 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఓ కంటైనర్ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ దగ్గి శివారులోకి రాగానే వాహనం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపాడు. లారీలో ఉన్న వివిధ రకాల పార్సిళ్లు, కొరియర్ వస్తువులు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సదాశివనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఒకరి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన లెగ్గల రాజు అనే వ్యక్తిని రిమాండుకు తరలించినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. లింగంపేటకు చెందిన చాకలి రాకేష్‌ను ఏప్రిల్ 14న రాత్రి సమయంలో రాజు చంపడానికి ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరిచాడన్నారు. ఈ ఘటనపై రాకేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజును గురువారం రాత్రి అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

గంజాయి విక్రేత పట్టివేత

ఖలీల్‌వాడి: నగర శివారులోని దుబ్బ బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వెంకటేష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం సాయంత్రం బైపాస్ రోడ్డులో నిఘా ఉంచగా, రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన పుల్లె లక్ష్మీనర్సింహ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 250 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై నర్సింహచారీ, హెడ్ కానిస్టేబుళ్లు భూమన్న, రాజన్న, కానిస్టేబుళ్లు భోజన్న, విష్ణు, అవినాష్, సాయి కుమార్, రాంబచ్చన్ ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

బోధన్: పట్టణంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రాకాసీపేటకు చెందిన అర్షద్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి శుక్రవారం బోధన్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి శేషతల్ప సాయి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

బోధన్: ఎడపల్లి మండలం ధర్మారం గ్రామ శివారులోని సిద్ధ చెరువులో ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ధర్మారం గ్రామానికి చెందిన మేకల ప్రశాంత్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



బీబీపేట: మండల కేంద్రంలోని స్థానిక వారాంతపు సంత వద్ద అక్రమంగా నిర్మించిన దుకాణం డబ్బాను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ తొలగించారు. గ్రామ పంచాయతీకి ఎలాంటి సమాచారం అందించకుండా రాత్రి వేళలో నిర్మించడంతో ఉదయాన్నే అధికారులు తొలగించారు. నిర్మించిన వారిని పిలిపించి మందలించారు.

అత్తను హత్యచేసిన అల్లుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేష్

పిట్లం(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అత్తను హత్య చేసిన అల్లుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు బాన్సువాడ సీఐ రాజేష్ తెలిపారు. బాన్సువాడ రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నా లక్ష్మీ (50) మూడేళ్ల క్రితం అల్లుడైన జిన్న బాగరాజుకు రూ.లక్ష అప్పుగా ఇచ్చింది. డబ్బులు ఇవ్వమని అల్లుడిని ఎన్నిసార్లు అడిగిన ఇవ్వలేదు. ఇటీవల బాగరాజు తను పండించిన జొన్నలను విక్రయించగా వచ్చిన డబ్బులను అత్త అకౌంట్‌లో వేయించాడు. ఆ డబ్బుల కోసం అతడు అత్తను అడిగాడు. తనకు ఇవ్వాల్సిన బాకీ కింద ఆ డబ్బులు జమచేసుకుంటానని అత్త అతడికి తెలిపింది. దీంతో పగ పెంచుకున్న బాగరాజు తన అత్తను చంపాలని పథకం పన్ని గురువారం మధ్యాహ్నం ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన రోజే నిందితుడు తన బైక్‌పై హత్యకు ఉపయోగించిన కమ్మ కత్తితో పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేని పాఠశాల సీజ్



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో గల మార్కెట్ రోడ్డులో శ్రీ చైతన్య పేరుతో నడుస్తున్న పాఠశాలను ఎంఈవో నాగేశ్వరరావు సీజ్ చేశారు. శుక్రవారం లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీనితో ఎంఈవో పాఠశాల అనుమతి పత్రాలను తనిఖీ చేసి చూడగా ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించవద్దని సూచించారు. నేతలు రాథోడ్ జీవన్, వంశీ నాయక్ ఉన్నారు.

మల్కాపూర్‌లో ఉద్రిక్తత

- అక్రమ ఇంటి నిర్మాణాన్ని తొలగించిన అధికారులు
- ఆత్మహత్యకు యత్నించిన కుటుంబీకులు



ఆత్మహత్యకు యత్నిస్తున్న బాధిత కుటుంబీకులు

ఎల్లారెడ్డి: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణం కూల్చివేతతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పెద్దెడ్ల నర్సింలు (బీజేపీ మండల అధ్యక్షుడు) ప్రభుత్వ స్థలంలో రెండు గజాల, ఆరు అంగులాల స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో సదరు ఇంటి యజమానికి నిర్మాణం నిలిపివేయాలని పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా ఇంటి నిర్మాణం చేపట్టడంతో డీఎల్‌పీవో సురేందర్ శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. అంతకుముందు కూల్చివేతకు వచ్చిన అధికారులను ఇంటి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. కుటుంబసభ్యులు అశోక్, రాకేష్, కృష్ణలు ఒంటిపై పెట్రోలు పోసుకోవడంతో పోలీసులు స్పందించి వారిపై నీరు పోసి, ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోకి ఎవరు రాకుండా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితుడు నర్సింలు మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే ఇంటి నిర్మాణం కూల్చివేయించారని ఆరోపించారు. తాను ఎలాంటి అక్రమ నిర్మాణం చేయలేదని తన సొంత స్థలంలోనే నిర్మించుకున్నట్లు తెలిపారు.

అటవీభూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పరిధిలోని అటవీ భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎఫ్ఆర్‌వో వాసుదేవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా అటవీ భూమిలోకి ప్రవేశించి చెట్లను, వాటి కొమ్మలను నరికినా, అటవీ భూమిని చదునుచేసినా, దున్నినా, అడవిలో దారులు ఏర్పాటు చేసినా, అటవీభూముల సరిహద్దులను చెరిపేసినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతోపాటు అటవీభూముల నుంచి ఇసుక, మొరం, రాళ్లు తరలించినా, వన్యప్రాణులను వేటాడినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఉపయోగించిన జేసీబీ, ట్రాక్టర్, లారీ, ఆటో, బైక్ వంటి వాహనాలను సైతం సీజ్ చేస్తామని చెప్పారు.